# నీల మోహనుడితో నిష్ఠూరాలాపన

-- డా. అక్కిరాజు సుందర రామకృష్ణ

"ఏచోటగాంచిన నీవుండువందురు. ఏమిటొ నీ మాయ తెలియ కున్నామయ్యా! ఈ అడవిదారిలో చేయూతనేయవ..." - అంటూ నా చిన్నతనంలో నేనురోజూ విన్న గానగంధర్వుడు కీ.శే. ఘంటసాల వేంకటేశ్వరరావు గారి పాట గుర్తుకువస్తున్నది. ఎప్పటిపాటండీ బాబూ! అదే! అదేమరి. మంచిసాహిత్యం గాని, మంచిపాటగానీ, మంచి రాగం గాని అలా శాశ్వతంగా మన హృదయాల్లోముద్ర వేసుకుంటాయి. ఇప్పటి మాటలు, పాటలు, గాయకులు ... వద్దులెండి.

పోయిన సంవత్సరం న్యూజెర్సీలో జరిగిన 'ఆటా' సభలకు వచ్చాను. పెద్దగా పలకరించిన దిక్కులేదు. కోపం వచ్చింది. చిన్నపిల్లలు కోపంవస్తే పోయివాళ్ళమ్మని కొడుతూంటారు. అలాగే నాకుకోపం వచ్చి వేంకటేశ్వరస్వామి మీద విరుచుకుపడ్డా! బలే బలే పసందయిన పద్యాలు వెలుగు చూసాయి. అసలే నావాక్కు చాలా వంకర. ప్రతిమాటలోనూ వికృతార్థాలుంటాయి. నాపుస్తకాలు చదివినవాళ్ళకు ఈమాటలు అనుభవైకవేద్యాలే. నాపద్యాలన్నీ కేవలం ఘాటే కాదు మోటు కూడా. నేన్ననమాటలు గావివి. పుస్తక సమీక్షకులన్న మాటలు. ఇవ్వాళ 'అమ్మ' ను గుర్తుకుతెచ్చుకునే రోజుట. అదే! "మదర్స్ డే" అండీ బాబూ! అమ్మతోనే ముగురమ్మల మూలపుటమ్మ తోనే నేను నా గోడు అంతా వినిపించినది. అందుకే పుస్తకంపేరే "అమ్మతోడు". అంతదాకా ఎందుకు సహజ కవి "పోతనా"మాత్యులవారు గూడా 'అమ్మలగన్నయమ్మకే' తనబాధంతా వివరించాడు. అమ్మతో నేను చాలా చనువుతో మాట్లాడాను. పోతనగారేమో చాలా వినయంగా, భక్తిగా మట్లాదాదు. అదీ తేడా. నేనేమన్నానంటే:

ఈశానీ! యిది యేమిచోద్యమటనే ఈపిచ్చిపన్లేమిటే!
బాసన్ పల్కగలేని జిహ్వాకరరే "వైస్‌ఛాన్సిల"ర్లిత్తువా?
దేశంబయ్యదిగొడ్డుపోయనటనే? తెల్లారినా తెల్వి, స
ర్వేశుం సైతము సంప్రదింపవలదా? శ్రీరాజరాజేశ్వరీ! - నా -

"అమ్మతోడు" పద్య కావ్యం నుంచి.

ఊరక కూర్చోలేక పోయినసారి "అమెరికా" కు వచ్చినపుడు మంచివి రెండు అధిక్షేప కావ్యాలు వ్రాసాను. "అమెరికాలో కవిసుందర్ - శ్యామ సుందర్" అనేది ఒక చిన్న అధిక్షేప రచన. శ్యామసుందరుడయిన వేంకటేశ్వరునితో కవిసుందరుడయిన ఈ "అక్కిరాజు" నిష్టూరాపనలే ఈపుస్తకం ఇతివృత్తం. స్వామితో ఏమి నిష్టూరం ఆడానంటే "అయ్యా! నీవు మధు మర్ధనుడవు. నేను మధుమేహిని." "పిల్లికి చెలగాటం - ఎలకకు ప్రాణ సంకట"మన్నట్లు .. ఏవేవో వ్రాశాను. ఈ పద్యాలు చదవండి.

ఆయమ "సుబ్బలక్ష్మి" అమలాపురమందుపుట్టి చక్కగా
ప్రాయము యిర్వదేండ్లచట లావుగమెల్గినకంతగూడనున్
ఖాయము "ప్యాంటు"దాల్చుటది కంజదళాక్ష "అమెరికా"న-నీ
ధ్యేయమదేమిటో తెలియనింతముగూడను-శ్యామసుందరా!

- అంటూ నా యొనర్పబూనిన కథాక్రమం బెట్టిదనినా ... ఇలా వ్రాసుకుపోతూ ...

శిక్షలవెన్నిలేవు వనజేక్షణ మాకు ధరిత్రిలోన -నీ
కక్షయదేమిటోతెలియకష్టమె: మిక్కిలిచెడ్డజబ్బు -నీ
పక్షము వారమౌ పరమభక్తులకేగతి శక్తిపూర్తిగా
భక్షణజేయు వ్యాధినిడ పాడియ చెప్పర-శ్యామసుందరా!

ఓ"సరసీరుహాక్ష" అయయో మరినాదగు "పేంక్రియాసు"పై
దూసితె నిర్దయన్ పరమ దుష్టులదున్మ"సుదర్శనంబు"-నీ
వాసియువన్నెగూర్చి మురిపంబుగ "కాంభోజి" నాలపించు, నన్
దాసుని దెబ్బతీసిన కృతఘ్నుడవీవుర - శ్యామసుందరా!

కుక్షినిసర్వలోకముల గొప్పగదాల్చినవేల్పుజేడ -పల్
ద్రాక్షలు, తియ్యమామిడిఫలంబులు నీకవి - "ఇన్సులేను యిం
జక్షను"లవ్విమాకు -భళి- చాలప్రశస్తపుతెల్వినీది -ప
ద్మాక్ష! జోహారు నీకు "మధుమర్ధన"గైకొను - శ్యామసుందరా!

"పొగరు" న నీవదెంత కడుపోటరి వౌదువో దేవతాళిలో;
"సుగరు"న అంతకంటెను యశోధనుడన్ ధరమర్త్యపాళినిన్!
నగమును బోలు ఉన్నతుని నాట్యకళామయమూర్తినిన్ ననున్
సగమునుజేసినావు; యిదిన్యాయమ! చెప్పర - శ్యామసుందరా!

"సుగర"ను వ్యాధి యిద్ది మధుసూదన, దేహికివచ్చినాక - యె
న్నగనికలేదు భేదము ఘనంబగుమేనికి "మున్గ కట్టెకున్"
సొగసులు సోకులున్ మివులసొంపులు వంపులు పైకిమాత్రమే!
మగతనమున్ హరించు పెనుమాయలజబ్బిది - శ్యామసుందరా!

ఇలా రెండువందల పద్యాలు సాగిపోతాయి. నేను తొలిసారి "అమెరికా"కు వచ్చినపుడు మా కవిబృందాన్ని తమ ఇంటికి తీసుకుపోయి అతిథి మర్యాదలు చేసిన సహృదయుడు, ఆత్మీయుడు, ఈ పత్రిక వ్యవస్థాపకుడు, కీ.శే. కిడాంబి "రఘునాథ్" గారికి ప్రేమతో ఈ వ్యాసం అంకితం. నేను విరోధిలో జన్మించాను. అందుకే చాలమందికి విరోధిని -- "తెలుగు జ్యోతి" వారికి దక్క.